విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు,ఆదివారం 03, డిసెంబర్ 2023

కరువు మండలంగా ప్రకటించాలి

తహశీల్దార్‌ను అడ్డగించిన సీపీఐ నాయకులు

విశాలాంధ్ర- ప్యాపిలి : మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ సీపీఐ నాయకులు ప్యాపిలి తహశీల్దార్ కారును అడ్డగించారు. శనివారం సీపీఐ ప్యాపిలి మండల సమితి ఆధ్వర్యంలో ప్యాపిలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, కరువు సహాయక చర్యలు చేపట్టాలని, గ్రామీణ ప్రాంతంలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థులకు అన్ని రకాల ఫీజును రద్దుచేసి ప్రభుత్వమే బరించాలని, వలసలో నివారించే విధంగా ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని పలు డిమాండ్స్ తో తహశీల్దారు కార్యాలయంకు ర్యాలీగా వెళ్ళారు. ఈ సందర్భంలో రామకృష్ణా పురంకి సర్వేకి వెళ్తున్న తహశీల్దార్‌ను చేసి వారి డిమాండ్స్ నెరవేర్చేంతవరకు కదలనివ్వమని వారి కారుకు అడ్డంగా బైఠాయించారు.అడ్డగించి, నిదానాలు చేయగా ఏమి చేయలేని పరిస్థితిలో డోన్ ఆర్డీఓతో మాట్లాడి కరువు మండలం గా ప్రకటించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వగా ధర్నాను విరమించుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ , సుంకయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్య ప్రతాప్, సీపీఐ మండల కార్యదర్శి వెంకటేష్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్లో వేసిన పంటలు వర్షాలు సరిగా లేక రైతులు నష్టపోగా ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలో 106 ప్రాంతాలను కరువు మండలాలుగా ప్రకటించిందన్నారు. కరువు కాటాలకు నిలయంగా ఉండే డోన్ నియోజవర్గంలోని ప్యాపిలి,డోన్ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించకుండా, సొంత మండలం బేతంచర్లను మాత్రమే కరువు మండలంగా ప్రకటించి మండల ప్రజల్ని మోసం చేశారని వారు మండిపడ్డారు. ఖరీఫ్ సీజన్లో రైతులు పండించిన పంటలు చేతికి రాక చేసిన అప్పులు తీరక ఏం చేయాలో అర్థం కాక పరిస్థితిలో ఇతర రాష్ట్రాలకు వలస పోతూ ,తమతోపాటు విద్యార్థులను కూడా తీసుకొని పోతున్నారని, దీనివల్ల విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని వారు ఆవేద వ్యక్తం చేశారు. కేవలం సీఎం డోన్ నియోజకవర్గం 77 చెరువులకు నామకరణంగా నీళ్లు విడుదల చేసి ప్రచారంకి మాత్రం డోన్ నియోజవర్గాన్ని సస్యశ్యామలంగా చేశామని భ్రమలో రాజారెడ్డి ఉన్నారని,ఆ భ్రమ నుంచి బయటికి వచ్చి కరువు కాటకాలతో అల్లాడుతున్న రైతులను ఆదుకొని, కరువు సహాయక చర్యలు చేపట్టి, విద్యార్థులకు అన్ని రకాల ఫీజులను రద్దుచేసి ప్రభుత్వమే భరించాలని వారు డిమాండ్ చేశారు. పంట నష్ట పరిహారం కింద నష్టపోయిన రైతులకు ఎకరాకు 30,000 రూపాయలు ఇవ్వాలని, గ్రామీణ ప్రాంతాలలో తాగు నీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, కావున ఆ సమస్యను పరిష్కరించాలని, రైతుల వలసను అరికట్టే విధంగా ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డోన్ నియేజకవర్గ కార్యదర్శి అబ్బాస్,ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివ కేశవులు, రైతు సంఘం నాయకులు కలచట్ల రామచంద్రుడు, నాయకులు యాత్రతాత, ఆంజనేయులు, గోవింద్, రాము తదితరులు పాల్గొన్నారు.

జీపు జాతను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-డోన్ : డోన్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఈ నెల 4,5 తేదీల్లో జరిగే జీపు జాతాను జయప్రదం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితా లో డోన్, ప్యాపిలి మండలాలు లేకపోవడం చాలా దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కే.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సుంకయ్యలు అన్నారు. శనివారం డోన్ పట్టణంలో నక్కి రామన్న భవనంలో సిపిఐ దొరపల్లె శాఖ కార్యదర్శి కొండయ్య అధ్యక్షతన సిపిఐ శాఖ కార్యదర్శి లో సమావేశం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్తిగా పంటలు సకాలంలో వర్షాలు కురవక కనీసం వేసినటువంటి విత్తనాలు కూడా చేతికి రాని పరిస్థితిలో కరువు విలయతాండవం చేస్తుందన్నారు. అధికారులు ఎటువంటి కరువు సహాయక చర్యలు చేపట్టకుండా తప్పుడు నివేదికలు పంపి రైతుల కడుపు కొడుతున్నారని వారు మండిపడ్డారు. ఈ విషయాన్ని సిపిఐ పార్టీగా అనేకసార్లు అధికారుల దృష్టికి,రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి రాజారెడ్డికి దృష్టికి తీసుకువెళ్లిన సరైనటువంటి స్పష్టత లేకపోవడం వల్ల ఈనెల 4,5 తేదీల్లో జీప్ జాతర నిర్వహించి 7 తేదీన పెద్ద ఎత్తున ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఎస్. పులి శేఖర్, బి. నారాయణ, సహాయకార్యదర్శి వరదరాజులు, శాఖా కార్యదర్శులు ఎస్.సుధాకర్, పాపరాయుడు, మధు, మనోహర్, సుంకన్న, రంగస్వామి, రాఘవేంద్ర, హరి,కేసన్న, రాంబాబు, మాధవయ్య తోపాటు అనేకమంది శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

వర్గాల కుమ్ములాటలతో వైసీపీ సతమతం

రాజకీయ కోణంతో ఆగిన ప్రారంభోత్సవాలు

విశాలాంధ్ర - వెలుగోడు : ఎన్నికలు సమీపిస్తున్న వేళ శ్రీశైలం నియోజకవర్గ ములో ప్రజలకు చేరువ కావడానికి ప్రధాన పార్టీలైన టీడీపీ , వైసీపీ నాయకులు నానా తంటాలు పడుతున్నారు. ఇరుపార్టీల నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలతో ప్రజలకు చేరువకావడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో 1.90 లక్షల ఓటర్లు వీరి భవితవ్యాన్ని తేల్చనున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గాల కుమ్ములాటలతో సతమతమవుతుంది.కర్ణుడు పరాజయానికి పది శాపాలు కారణమన్నట్లు, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి గెలుపుకు అసంతృప్తి నాయకులు అన్నట్లు తయారైంది. గ్రామాల్లో పార్టీ నాయకుల మధ్య ఉన్న అంతర్గత విభేదాల వల్ల పార్టీ ప్రతిష్ట దిగజారి పోతుందనడం లో ఎలాంటి అతిశయోక్తి లేదని పలువురు పార్టీ విశ్లేషకులు అభిప్రాయము వ్యక్తం చేస్తున్నారు. వర్గాల నాయకుల మధ్య ఉన్న విభేదాల ను పరిష్కరించడం లో అధినాయకత్వం విఫలమైందని చెప్పవచ్చు మండలంలో వైసీపీ నాయకుడి ప్రవేటు ఫంక్షన్ లో ఇరువురు మైనార్టీ నాయకులు ముష్టి యుద్దానికి దిగి పంచాయతీ పోలీస్ స్టేషన్ వరకు వెళ్లిందంటే వైసీపీలో ఏమేరకు నాయకుల మధ్య వర్గ విభేదాలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.పట్టణంలో పలువురు నాయకులు అసంతృప్తితో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. బోయరేవులలో ఇరువురు నాయకుల మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించడం లో అధినాయకత్వం విఫలం కావడంతో ఒక బి.సి.సర్పంచ్ వర్గం పార్టీకి దూరమైనది.సింగిల్ విండో చైర్మన్ పదవిని ఒక నాయకునికి ఇచ్చినట్లే ఇచ్చి మార్చడం వల్ల అసంతృప్తితో టిడిపి లో చేరారు. అబ్దుల్లా పురం గ్రామంలో రెండువర్గాల మధ్య విభేదాలు పార్టీ నాయకత్వానికి తలనొప్పి గా మారింది. అక్కడ ఉపాధిహామీ పథకం లోని ఒక ఉద్యోగం అనుకున్న ఒప్పందం ప్రకారం తమ వర్గానికి ఇవ్వలేదని సర్పంచ్ వర్గం వైసీపీకి దూరంగా వుంది.అంతేగాక రాజకీయ కారణంతో అక్కడ సంవత్సరం క్రితం సచివాలయం, మిల్క్ సెంటర్ , రైతు భరోసా కేంద్రం పూర్తయిన్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. మోత్కూర్ గ్రామంలో రెండు వర్గాల మధ్య విభేదాలను పరిస్కరించక పోవడంతో ఒక బి.సి.నాయకుడు టీడీపీ పార్టీలో చేరారు.బండిఆత్మకూరు మండలంలోని పరమటూరు గ్రామంలో ఇరువురు అసంతృప్తితో పార్టీకి దూరమయ్యారు. సంతజుటూరు గ్రామంలో ఎంపీటీసీ భర్త, మరో నాయకుడు ముష్టి యుద్దానికి పాల్పడ్డారు . ఈ విషయంలో పోలీస్ స్టేషన్ లో కేసు కూడా నమోదైంది.పార్నపల్లి గ్రామంలో ఒక నాయకుడు టిడిపిలో చేరారు. ఎర్రగుంట్ల గ్రామంలో ఒక నాయకుడు అసంతృప్తితో పార్టీ కి దూరంగా ఉన్నారు.ఆత్మకూరు మండలం లోని కరివేన గ్రామంలో వైసీపీకి చెందిన యువజన నాయకుడు దినకర రావు అసంతృప్తి తో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు.వెంకటాపురంకు చెందిన మరో ఎంపిటిసి వర్గం ఎంపీపీ పదవి ఇస్తానని మోసం చేసారని పార్టీ పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు.ఆత్మకూరు లోని ఇందిరా నగర్ వైసీపీకి చెందిన 50 కుటుంబాలు , ఆర్యవైశ్య యువకుడు రవి , కురుకుందకు చెందిన వైసీపీ వారు అసంతృప్తి తో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే పట్టణంలో ని పలువురు కౌన్సిలర్లు వైసీపీ నాయకుల విధానాలు నచ్చకపోవడంతో అసంతృప్తి తో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. పవిత్రమైన శ్రీశైలం లో రాజకీయాలకు తావు ఉండకూడదు. ప్రతిదీ రాజకీయం చేస్తూ నాయకులు అపవిత్రం చేస్తున్నారు. ఏది ఎలా ఉన్నా , ఎందరు పార్టీ నుంచి దూరమైన ముఖ్యమంత్రి అమలు చేసిన నవరత్నాలు ప్రజలకు అందించడం , సంక్షేమ పథకాలు , నా యొక్క మంచి తనం , సొంత నిధులు పెడుతూ ఎందరినో అదుకుంటున్నందు వల్ల నా గెలుపును ఎవ్వరూ అడ్డుకోలేరని ధీమాతో శిల్పా ముందుకు సాగుతున్నారు.

ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడండి

విశాలాంధ్ర - శ్రీశైలం : ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీశైలం లో దేవస్థానం వారు చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం నాడు కార్యనిర్వహణ అధికారి డిపెద్దిరాజు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు ఈ పర్యనల్ లో భాగంగా ఆర్ అండ్ బి అత్యధిక గృహం ఘంటా మఠం విభూది మఠం వలయ రహదారి పాతాళ గంగ వెళ్లే మార్గం పాత మెట్ల మార్గం శివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ మొదలగు ప్రదేశాలను పరిశీలించారు భక్తులు రద్దీ సమయంలో వాహనాల ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఉండేలాగా చర్యలు తీసుకోవాలని మరికొన్ని ప్రదేశాలలో వాహనాల పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయాలని భక్తులు స్థానాలు చేసుకునేందుకు షవర్ బాతులు ఏర్పాటు చేసి భక్తులకుఇబ్బంది కలగకుండా ఉండేలాగా చర్యలు తీసుకోవాలని ప్రధాన కూడళ్లల్లో ఎక్కువ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని నీటి నిర్వహణకు రెండు లక్షల లీటర్ల సామర్థ్యం గల సంపును ఏర్పాటు చేసుకోవాలని. రోడ్డుకు ఇరువైపులా ఎప్పటికప్పుడు పిచ్చి మొక్కలను పీకేస్తూ జంగిల్ క్లియరెన్స్ చేయాలని భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కార్య నిర్వహణ సూచించారు.

కొత్తూరు సుబ్బరాయుని సన్నిధిలో రాష్ట్ర పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ పూజలు

విశాలాంధ్ర - పాణ్యం : ప్రముఖ శైవ క్షేత్రం మండల పరిధిలోని ఎస్. కొత్తూరు గ్రామంలో వెలిసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని రాష్ట్ర పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ సుబ్బారెడ్డి కుటుంబ సమేతంగా శనివారం సందర్శించారు. ముందుగా ఆలయ అర్చకులు,అధికార సిబ్బంది ఆలయం మర్యాదలతో స్వాగతం పలికి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి అభిషేకంలు, అర్చనలు,విశేష పూజలు వారు నిర్వహించారు.అనంతరం ఆశీర్వాద మండపంనందు శాలువాలు, పూలమాలతో అర్చకులు కిట్టయ్య స్వామి వారిని సత్కరించి తీర్థ ప్రసాదములు అందజేశారు.ఆయన వెంట పాణ్యం డీఈఈ గంగాధర్,ఏఈ మహబూబ్ బాషా,ఇంజనీరింగ్ అధికారిని విద్య,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బైకు దహనం

విశాలాంధ్ర - పాములపాడు : గుర్తుతెలియని వ్యక్తులు బైకు కాల్చి బూడిద చేసిన సంఘటన మండల పరిధిలోని భానుమొక్కుల టర్నింగ్ దగ్గర చోటుచేసుకుంది, ఎస్సై అశోక్ వివరాల మేరకు శనివారం తెల్లవారుజామున తెల్లవారుజామున సుమారు 2 గంటల నుండి 4 గంటల మధ్య భానుముక్కల టర్నింగ్ దగ్గర ఆంజనేయస్వామి టెంపుల్ దగ్గర భానుముక్కల గ్రామానికి చెందిన రాము నాయక్ అనే వ్యక్తి బైక్ ను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు మంట పెట్టి అంటించినారని రాము నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

ఒత్తిడికి గురవుతున్న ఉద్యోగులు

▶▶ఇంటికి దూరంగా రాత్రి పొద్దుపోయే విధుల నిర్వహణ

▶▶ఆరోగ్య సమస్యలు ఉంటే అంతే సంగతులు

విశాలాంధ్ర - డోన్ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న పని విధానంలో రెవెన్యూ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు ఓటరు నమోదు కార్యక్రమంలో కింది స్థాయి ఉద్యోగి నుండి ఉన్నత పదవిలో ఉన్న పై స్థాయి అధికారుల వరకు తీవ్ర ఒత్తిడికి గురవుతూ అటు గ్రామస్థాయిలో నుండి ఇటు పట్టణ స్థాయి వరకు ఓటరు నమోదు కార్యక్రమంలో, కొత్త ఓటర్లను చేర్చడం, ప్రాంతాలు మారిన వారిని గుర్తించడం, చనిపోయిన వారి వివరాలు సేకరించడం మరియు పలుచోట్ల ఓటర్లుగా నమోదు కాబడిన వారిని గుర్తించి తొలగించడం , ఒకే ఇంటిలో ఎక్కువ సంఖ్యలో నమోదు కాబడిన ఓటర్ల ను తొలగించడం వంటి పనులే కాకుండ ఫ్రీ హెూల్డ్ అసైన్మెంట్ పరిశీలన వంటి పనులలో పై స్థాయి అధికారులు క్రింది స్థాయి ఉద్యోగుల పట్ల అనుసరిస్తున్న విధానం పట్ల పలువురు ఉద్యోగులు అసహనాన్ని వ్యక్త పరుస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుండి రాత్రి 2,3 గంటల వరకు కుటుంబాలకు దూరమై సమయాన్ని కేటాయించి పనులు చేస్తున్న కొంతమంది పై అధికారులు సంతృప్తి చెందడం లేదని అధికారులు వాపోతున్నారు.

ఆరోగ్య సమస్యలు ఉంటే అంతే సంగతులు : గ్రామ పట్టణ స్థాయిలలో సచివాలయ సిబ్బంది బూత్ లెవెల్ అధికారులుగా సూపర్వైజర్లుగా వీఆర్వోలు విధులు నిర్వహిస్తున్నారు.వీరిపై డిప్యూటీ తాసిల్దార్ స్థాయి ఉద్యోగులు,వారిపై అసిస్టెంట్ ఎలక్ట్రో ఆఫీసర్ గా తాసిల్దార్, తాసిల్దార్ లపై ఎలక్ట్రో రెవెన్యూ ఆఫీసర్ గా ఆర్డీఓ ల అజమాయిషి, ఆర్డీఓ లపై జిల్లా అధికారుల పని ఒత్తిడి ఉండడం వలన ఎప్పుడు ఏ అధికారి ఎలా ప్రవర్తిస్తాడోనని కిందిస్థాయి ఉద్యోగాలు తీవ్రంగా ఆలోచించి అనారోగ్య పాలైన వారు ఎందరో ఉన్నారు.

ప్రోటో కాల్ తప్పని పరిస్థితి : ఒకవైపు ఓటరు నమోదు విషయంలో తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్న ఉద్యోగులకు ప్రోటోకాల్ పుండు మీద కారంలా తయారయింది. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు,జిల్లా ఉన్నతాధికారులు ఎవరు వచ్చిన తమకు ప్రోటోకాల్ పెద్ద సమస్యగా తయారయిందని రాజకీయ నాయకులు అధికారులు వస్తున్నారంటేనే తమకు కష్టాలు వస్తున్నట్టేనని ఉద్యోగులు గజగజలాడుతున్నారు. తమకు కూడా కుటుంబం, భార్యా పిల్లలు మాత్రమే కాకుండా అధిక వయస్సు కలిగిన వృద్ధులైన తల్లిదండ్రులు ఉన్నారని వారిని చూసుకొనే బ రువు బాధ్యతలు తమపై ఉన్నాయని ఇప్పటికైనా నాయకులు ఉన్నతాధికారులు తమను కూడ మనుషులుగా గుర్తించి పని ఒత్తిడిని తగ్గించాలని ఉద్యోగుల కోరుతున్నారు.

సంక్షేమ పాలనపై ప్రజల హర్షం

విశాలాంధ్ర - నంద్యాల : అర్హత కలిగిన గడప గడపకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు వెల్లువలా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి అన్నారు. నంద్యాల పట్టణ 22వ వార్డు క్రాంతినగర్ నందు 185వ రోజు స్థానిక కౌన్సిలర్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పాల్గొన్నారు. వార్డ్ వైసిపి నాయకులు, మహిళలు హారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల ఈ నాలుగున్నరేళ్లలో అందిన లబ్ధిని ఆయన వివరిం చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, ఏపీఎస్పీ డీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, వైసీపీ నాయకులు రామ సుబ్బారెడ్డి, మనీ మోహన్ రెడ్డి, మల్లికార్జున, నంద్యాల పట్టణ అధ్యక్షులు జాకీర్ హుస్సేన్, రహంతుల్లా ,అంజి, గన్ని కరీం, అధికారులు, సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లల నమోదుపై జిల్లా అధికారుల ముందస్తు సర్వే

జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్

విశాలాంధ్ర - నంద్యాల : గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వేలో 100 శాతం పూర్తయి విద్యాసంస్థల్లో చేరిన విద్యార్థులు గైర్హాజరు కాకుండా ఖచ్చితంగా పాఠశాల ల్లోనే ఉండేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరే ట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో నమోదుపై జిల్లా అధికారులు, సంబంధిత విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ5-18 సంవత్సరాల లోపు పిల్లలందరూ బడి బయట ఉండకు ండా పాఠశాలల్లో లేదా ఓపెన్ స్కూల్లో లేదా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏదో ఒక విద్యాసంస్థలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిఈఆర్ సర్వేపై త్వరలో కేంద్ర బృందం వెరిఫికేషన్ వున్న నేపథ్యంలో ముందస్తు సర్వేపై జిల్లా అధికారులను మండల స్పెషల్ అధికారులుగా నియమించామని, ప్రతి మండల స్పెషల్ అధికారి తమ పరిధిలోని బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు 30 గృహాలను ర్యాండమ్ తనిఖీ చేసి సూచించిన ప్రొఫార్మాలో పొందుపరిచి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఈఓ సుధాకర్ రెడ్డి, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, భూగర్భజల శాఖ డిడి రఘురాం, డ్వామా పిడి రామచంద్రారెడ్డి తదితర జిల్లా అధికారులు మండలాల నుండి సంబంధిత అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమీక్షలో పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడి మృతి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పురపాలక సంఘం లో గత 30 సంవత్సరములుగా పారిశుద్ధ్య కార్మికునిగా పనిచేయుచున్న బొందెల రాజశేఖర్ అనారోగ్యం కారణంగా కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే కమిషనర్ ఏవి రమేష్ బాబు పట్టణంలోని రాజశేఖర్ స్వగృహానికి చేరుకుని రాజశేఖర్ భౌతిక కాయానికి నివాళులర్పించి అంత్యక్రియల నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు 15 వేల రూపాయలు అందజేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే పట్టణ వైకాపా ఇన్చార్జ్ గోపవరం నరసింహారెడ్డి పాల్గొని వారి కుటుంబ సభ్యులను ఓదార్చి భౌతిక కాయానికి నివాళులు అర్పించి వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ సురేంద్ర నాథ్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ సునీత, బాలస్వామి, యేసు, అరుణ్, వసంత , అపర్ణ, సురేష్ మరియు పారిశుద్ధ్య కార్మికులు తదితరులు ఉన్నారు.

రహదారి స్థల పరిశీలన

విశాలాంధ్ర - చాగలమర్రి : కడప జిల్లా ప్రొద్దుటూరు నుంచి చాగలమర్రి హైవేకు అనుసంధానం చేసే నేషనల్ హైవే 440 రహదారిలో భూములు కోల్పోతున్న స్థలాన్ని నంద్యాల ఆర్డిఓ శ్రీనివాస్, నేషనల్ హైవే ఈఈ భాస్కర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌హెచ్ 440 రహదారి నిర్మాణంలో భాగంగా 252/3 సర్వే నెంబర్‌లో నలుగురు రైతులకు సంబంధించిన 59 సెంట్లు భూమిని కోల్పోతున్నారన్నారు. ఈ రహదారి నిర్మాణంలో తమ విలువైన భూములు కోల్పోతున్నామంటూ సంబంధిత రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో పరిశీలించడం జరిగిందన్నారు.జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి రైతులకు న్యాయం చేస్తామన్నారు. అనంతరం చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర,బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటర్ల ప్రత్యేక క్యాంపును పరిశీలించి బిఎల్ఓలకు తగిన సూచనలను సలహాలను ఇచ్చారు.తహసీల్దారు సుభద్రమ్మ, ఎన్‌హెచ్ ఏఈ సురేంద్రా రెడ్డి,డిటి శ్రీనివాసులరెడ్డి,మండల సర్వేయర్ మద్దిలేటి,విఆర్ఓలు శ్రీనివాసులు, వెంకటరా మిరెడ్డి,రైతులు,పాల్గొన్నారు.

అవుకు అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం

విశాలాంధ్ర - అవుకు : అవుకు పట్టణంలో అభివృద్ధి పనులను శరవేగంగా చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు బనగానపల్లి శాసనసభ్యుడు కాటసాని రామిరెడ్డి తెలిపారు.పట్టణంలోని మూడవ సచివాలయ పరిధిలోని కుమ్మరి దిడ్డి, రాజు విధి, అగ్రహారంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బనగానపల్లె శాసనసభ్యుడు కాటసాని రామిరెడ్డి, ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ చల్లా విజయ భాస్కర్ రెడ్డి, వైసిపి ముఖ్య నాయకులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, పట్టణ మాజీ దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ముడియాల జయచంద్రారెడ్డి లు పాల్గొన్నారు. దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రామిరెడ్డి మాట్లాడుతూ మూడు సచివాలయాల పరిధిలోని అన్ని కాలనీలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిందని అన్నారు. కాలనీలలో ఎక్కువ శాతం మౌలిక వసతులు కల్పించాలని, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయించాలని అడిగిన కాలనీవాసుల కోరిక మేరకు వెంటనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. పట్టణంలోని ముస్లిం వీధి, ఎస్సీ కాలనీ, కోటా వీధిలో కోటి రూపాయల తో సిసి రోడ్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ వెంకటరమణ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కరిముల్లా, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది, వాలంటరీలు, పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్తో సస్యశ్యామలం చేస్తాం



విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : టిడిపి అధికారంలోకి రాగానే తిమ్మనాయునిపేట చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని తరలించి గ్రామాలను సత్యశ్యామలం చేస్తామని బనగానపల్లి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తిమ్మనాయుని పేట, పెద్దవెంతుర్ల గ్రామాలలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలోఆయన పాల్గొన్నారు. ఆయా గ్రామాలలో గ్రామ ప్రజల సమస్యలనుఅడిగి తెలుసుకున్నారు. టిడిపి అధికారంలోకి రాగానే అమలు చేసే పథకాలను తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీసీ మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వం హయాంలో తిమ్మనాయని పేట చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని తరలించేందుకు జి వో తెచ్చి సర్వే పూర్తి చేసామని అన్నారు. అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని తుంగలో తొక్కిరైతులను ఇబ్బందుల్లోకి నెట్టేసిందన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువుకు నీటిని తరలిస్తే10వేల ఎకరాలకు అంది చుట్టుపక్కల గ్రామాలు సస్యశ్యామలమై రైతులుకష్టాల నుండి బయటపడతారన్నారు.వర్షాబావ పరిస్థితులు తలెత్తినప్పుడు కూడా రైతులు పంటలు పండించుకోవచ్చునారు. టిడిపి అధికారంలోకి రాగానే లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేసి రైతులకు నీరందిస్తామన్నారు. అన్నదాతలకు ప్రతి సంవత్సరం 20 వేల రూపాయలు, నిరుద్యోగులకు ప్రతినెల 3 వేల రూపాయలు, మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం,18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు రు 18వేలు , చదువుకునే ప్రతి విద్యార్థికి15వేలు అందిస్తామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టిడిపిని ఆదరించి గెలిపించాలని ఆయన కోరారు. టిడిపి నాయకులు నంద్యాల రామేశ్వర్ రెడ్డి, వి ఆర్ లక్ష్మీరెడ్డి, ఐ వి పకీర రెడ్డి, జయలక్ష్మి రెడ్డి,కోటపాడు శివరామిరెడ్డి, తిమ్మనాయునిపేట నాయకులు గోపాల్, గిరి, సుబ్బరాయుడు, బాల సుబ్బరాయుడు, భాష,ఓబులేష్, ఎల్ఐసి బాలు, పెద్ద వెంతుర్ల నాయకులు సిపి చెన్నారెడ్డి, ద్వారాక రెడ్డి, గోవర్ధన్, రంగన్న, లేపాక్షి రెడ్డి, శివారెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

విశాలాంధ్ర కొలిమిగుండ్ల : మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో విద్యుత్ సబ్స్టేషన్ ఎదురుగా వి హరికృష్ణ (16) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్ఐ రమేష్ రెడ్డి శనివారం తెలిపారు.ఎస్ఐ వివరాల మేరకు గ్రామానికి చెందిన ఆదినారాయణ కుమారుడు ప్రసాద్ ట్రాక్టర్ లో రాళ్ళను నింపుకోవడానికి హరికృష్ణ ను తీసుకువెళ్లాడు. ట్రాక్టర్లో గోడరాలను నింపుకున్న తర్వాత వస్తుండగా సబ్స్టేషన్ వద్ద ప్రసాద్ అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా అతివేగంగా టాక్టర్ను నడపడంతో కుదుపులకు లోనై ట్రాక్టర్ ఇంజన్ పై కూర్చున్న హరికృష్ణ పెద్ద టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

యాగంటి క్షేత్రంలో బీసీ ఇందిరమ్మ

విశాలాంధ్ర - బనగానపల్లె: మండల పరిధిలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి ఉమామహేశ్వర స్వామిని బీసి ఇందిరమ్మ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం కావడంతో శనివారం ఉమామ హేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో అమరనాథ్ రెడ్డి, శంకేశ్వర్ రెడ్డి, నారాయణరెడ్డి, బిసి మదన భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు రైల్వే రాయితీ పాసులను పునరుద్ధరించాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టుల కు రైల్వే రాయితీ పునరుద్ధరించాలని ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో శనివారం కర్నూలు రైల్వే డిప్యూటీ మేనేజర్ శేషఫణిని కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐజేయూ జాతీయ సమితి సభ్యులు కొండప్ప, కే నాగరాజు,ఏపీయూడబ్ల్యూజే జిల్లా గౌరవ సలహాదారులు వైవీ క్రిష్ణారెడ్డి,జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ.ఎన్.రాజు, కే.శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి అంజి, ఉపాధ్యక్షుడు దస్తగిరి, సహయ కార్యదర్శి అవినాష్ లు మాట్లాడుతూ.. వార్తల సేకరణ కోసం జర్నలిస్టులు ఒక చోట నుంచి మరొక చోటుకు వెళ్ళే అవకాశం ఉందని, ఈ తరుణంలో రైల్వే చార్జీలు చెల్లించి వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. అసలే చాలీచాలని వేతనాలతో వృత్తి పై మమకారం, సమాజం పట్ల బాధ్యత తో ముందుకు వెళుతున్నారని అన్నారు. జర్నలిస్టుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గతంలో ఉన్న ప్రభుత్వాలు జర్నలిస్టులకు రైల్వే చార్జీలో 50 శాతం రాయితీ కల్పిస్తూ కేంద్రం ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. అయితే కరోనా లో కేంద్రం అన్ని రకాల రాయితీ లతో పాటు జర్నలిస్టుల రాయితీ పాసుల ను కూడా రద్దు చేసిందన్నారు. రాయితీ పాసులను పునరుద్ధరించాలని విన్నవించినా ఫలితం లేదన్నారు. దీంతో జర్నలిస్టుల ఇబ్బందులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి జర్నలిస్టుల రాయితీ పాసు లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్టేషన్ మేనేజర్ మాట్లాడుతూ జర్నలిస్టుల డిమాండ్ ను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తా అని హామీ ఇచ్చారు.

4న కలెక్టరేట్ లో స్పందన

విశాలాంధ్ర బ్యూరో -కర్నూలు : ఈనెల 04 వ తేదీ సోమవారం కర్నూలు కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

యథేచ్ఛగా....ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు

▶▶కాసులు కురిపిస్తున్న....ఎర్రమట్టి రవాణా

▶▶కోట్లకు పడిగెత్తుతున్న అక్రమ వ్యాపారులు

▶▶మామూళ్ల మత్తులో అధికారులు

విశాలాంధ్ర - కల్లూరు : కొండలు,గుట్టలు,వాగులు,వంకలు అని తేడా లేకుండా ఎర్ర మట్టి అక్రమ రవాణా దారులు యదేచ్ఛగా తవ్వకాలు జరుపుతూ మట్టిని రవాణా చేస్తూ ప్రభుత్వానికి భారీ గండి పొట్టి కోట్లకు పడిగెత్తుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడని ఆరోపణలు వ్యక్తమవు తున్నాయి. ఈ మేరకు కల్లూరు మండల పరిధిలోని లక్ష్మీపు రం, దూపాడు, పెద్దటేకూరు ,తడకనపల్లి ,వామసముద్రం, కొల్లంపల్లి తండా ,ఉలిందకొండ, ఎర్రకత్వ, యాపర్లపాడు, మార్కాపురం తదితర గ్రామా పరిధిలో ఎర్ర మట్టి భూములు అధికంగా ఉండడంతో వాటి పక్కనే ఉన్న వాగులు, వంకలు, కొండలు సైతం జెసిపిలు ఇటాచిలతో పెకలించి ప్రత్యేక వాహనాలతో ఎర్రమట్టిని అక్రమదారులు నిత్యం తరలిస్తున్నారు. కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములలోని ఎర్రమట్టిని అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా స్వేచ్ఛగా అధికారులకు ముడుపులు చెల్లించి ఎర్ర మట్టి రవాణాను మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగిస్తూ కోట్లకు పరిగెత్తుతున్న పరిస్థితులు మండలంలో నెలకొన్నాయి. అధికార, ప్రతిపక్ష నాయకుల అండదండలతో ఎర్ర మట్టి రవాణా మామూల మత్తులో జోరుగా కొనసాగుతుంది. కొన్ని గ్రామాల్లోని రెవెన్యూ,పోలీస్, మైనింగ్ తదితర శాఖల అధికారులు మామూలకు అలవాటు పడి వాహనాలు వారి కళ్ళముందే వెళుతున్న పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు మండిపడుతున్నారు. అక్రమ రవాణా పై ప్రజలు సంబంధిత అధికారులకు సమాచారం అందిస్తే అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ప్రజలకు మాయమాటలు చెప్పిన అధికారులు అక్రమదారులు ఇచ్చే మామూలుగా అలవాటు పడి అక్రమ రవాణా పై సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లను గ్రావెల్ సరఫరా చేసే మాఫియా కు తెలియజేసి వారి మధ్య ఘర్షణలు నెలకొల్పి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మరో మారు ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని వారికి హుకుం జారీ చేస్తున్నట్లు బాధ్యత ప్రజలు వాపోతున్నారు. కోట్ల విలువ చేసే ఎర్రమట్టి విలువను ప్రభుత్వానికి ఎలాంటి ఆదాయం లేకుండా స్థానిక ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు.అధికారుల కనుసన్నాల్లోనే ఎర్ర మట్టి రవాణా జోరుగా జరుగుతున్నాయని గుసగుసలు మండలంలో వినిపి స్తున్నాయి. వ్యవసాయ భూముల సైతం లెక్కచేయకుండా రాత్రి వేళల్లో గ్రావెల్ వాహనాలను ఇష్టానుసారంగా తీసుకెళ్లడంతో చేతికొచ్చిన పంటలు నాశనం అవుతున్నాయని వాహనాలు తిరగడంతో రహదారులకు ఇరువైపులా ఉన్న వ్యవసాయ పంట పొలాలపై దుమ్మదూలి విపరీతంగా చేరి పంటలు చేతికి రాకుండా వాడిపోతున్నాయని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఇంత జరుగుతున్న రెవెన్యూ ,మైనింగ్, పోలీస్ శాఖ అధికారులు నెల మామూలుగా అలవాటు పడి అక్రమ రవాణా మండలంలో పెద్ద ఎత్తున జరుగుతున్న కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ మట్టి వ్యాపారులు వెంచర్లకు, రహదారులకు ,బిల్డింగ్ పూడికలకు తరలిస్తున్నారు. ఎంత వర్షం పడిన ఎన్ని వాహనాలు తిరిగినా ఎర్ర మట్టి వేస్తే సౌకర్యంగా ఉంటుందని ప్రజలు ఎర్రమట్టిని ఎక్కువ వాడడంతో ఎర్రమట్టి వాడకానికి మార్కెట్లో భారీగా డిమాండ్ పెరిగి వాటి అవసరం రెట్టింపు అయింది. వీటిని అదునుగా చేసుకున్న ఎర్రమట్టి వ్యాపారులు టిప్పర్లు లారీలు ట్రాక్టర్ల సహాయంతో రాత్రి పగలు తేడా లేకుండా ఎలాంటి అనుమతులు లేకుండా ఎర్రమట్టిని వెంచర్లకు ఇతర ప్రాంతాలకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు మట్టి తవ్వడంతో గుంతల మయంగా మారి ఎటు పనికి రాకుండా అవుతున్నాయని ఆయా గ్రామాలలోని ప్రజలు పేర్కొంటున్నారు. చిన్నటేకూరు, పెద్దటేకూరు, దూపాడు, లక్ష్మీపురం ,వెంకన్న బావి ,నన్నూరు, తడకనపల్లి ,తాండ్రపాడు, ఓర్వకల్లు తదితర గ్రామాలలో అక్రమ ఎర్రమట్టిదారులు రోజురోజుకి పుట్టగొడుగుల్ల వందలాది వాహనాలతో ఎర్రమట్టిని తరలిస్తున్నారని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎర్రమట్టి తవ్వకాల పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి...ఏఐటీయూసీ

విశాలాంధ్ర - కర్నూలు : కోడుమూరు పంచాయతీలో పనిచేస్తున్నటువంటి స్వచ్ఛ భారత్ కార్మికులకు బకాయి పడినటువంటి 4 నెలల జీతాలు చెల్లించాలని కర్నూలు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడుకి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మునెప్ప వినతి పత్రం ఇవ్వడం జరిగి ంది. ఈ సందర్భంగా ఎస్ మునెప్ప మాట్లాడుతూ కోడుమూరు పంచాయ తీలో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు నాలుగు నెలల నుండి జీతాలు చెల్లించకపోవడంతో,రోజంతా పని చేసిన కార్మికులుపస్తులున్నటువంటి పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛభారత్ కార్మికులకు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు పోషణ కొరకు,వాళ్ల పిల్లలు చదువులు కొరకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,బకాయి పడినటు వంటి కార్మికుల నాలుగు నెలల జీతాలు చెల్లించాలని నాగరాజు నాయుడుని కోరడమైనది. అలాగే ప్రతి నెల జీతాలు చెల్లించేందుకు స్థానిక అధికారులకు ఆదేశిలవ్వాలని,లేకపోతే కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడతాయని వారు ఆవేదన చెందారు. జిల్లాలోని అనేక గ్రామపంచాయతీలో పనిచేసినటువంటి స్వచ్ఛభారత్ కార్మికులకు 5నెలల నుండి 10 నెలల వరకు జీతాలు పెండింగ్ ఉన్నాయని,జీతాలు చెల్లించమంటే అధికారులు నిధులు లేవని చెబుతున్నారు. కానీ 11వ ఫైనాన్స్ కమిషన్ నిధులు కేంద్రం నుండి వచ్చినప్పటికీ నిధులు లేవని చెప్పడం ఎంతో హాస్యాస్పదం అన్నారు. పెండింగ్లో ఉన్నటువంటి పంచాయతీ కార్మికుల, స్వచ్ఛభారత్ కార్మికుల జీతాలు చెల్లించేందుకు కృషి చేయాలని జిల్లా పంచాయతీ ఆఫీసర్ కువిజ్ఞప్తి చేశారు.

మెడికల్ కళాశాలకు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల : డిసెంబర్ ఒకటో తేదీన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రతి ఏటా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారు, చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డులు ఇస్తుంటారు. ఈ సంవత్సరము కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు, కర్నూలు మెడికల్ కళాశాలకు ఈ రాష్ట్రస్థాయి అవార్డులు వచ్చాయి. ఈ అవార్డులు రావడం పట్ల కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల పర్యవేక్షకులు డాక్టర్ వెంకట రంగారెడ్డి మాట్లాడుతూ మన ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రెండు ఉత్తమ అవార్డులు రావడం మనమందరం ఎంతో గర్వించదగ్గ విషయం అన్నారు.ఐ సి టి సి ఓపీ మరియు స్టేట్ రిఫరెన్స్ లేబరేటరీ మైక్రో బయాలజీ విభాగాలకు ఈ అవార్డులు వచ్చాయన్నారు. నిన్న ఉదయం 11 గంటలకు రాష్ట్రస్థాయి అవార్డులను రెండు విభాగాల సిబ్బందికి డాక్టర్ వెంకట రంగారెడ్డి చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరిడెంట్ డా.ప్రభాకర్ రెడ్డి సిఎస్ఆర్ఎంఓ డా.వెంకటేశ్వరరావు, మైక్రో బయాలజీ విభాగాల అధిపతి డా. రేణుకాదేవి, ఐ సి టి సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శిరీష,డాక్టర్ హరిత, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డా.శివబాల నగాంజన్ నర్సింగ్ సిబ్బంది మరియు ఇతర వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు క్యాంపు తనిఖీ

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల పరిధిలోని నౌలేకల్ గ్రామంలోని పోలింగ్ బూత్ లో ఓటర్ నమోదు ప్రత్యేక క్యాంపును తహసిల్దార్ వీరేంద్ర గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ మహేష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 2024 జనవరి 1 లోగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరినీ కొత్తగా ఓటరు నమోదుకు ధరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఓటరు జాబితాను పకడ్బందీగా వెరిఫికేషన్ చేయాలని బీఎల్ఓలను ఆదేశించారు.

నేడు దక్షిణాది రాష్ట్రాల కరాటే పోటీలు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : ఏ.బి. కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం దక్షిణాది రాష్ట్రాల కరాటే టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధినేత ఫయాజ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి సుమారు 650 మంది క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఉదయం 10:00 గంటలకు చెక్‌పోస్ట్ సమీపంలోని దేవి ఫంక్షన్ హాలులో టోర్నమెంట్‌ను నగర మేయర్ బి.వై. రామయ్య, కమిషనర్ ఏ.భార్గవ్ తేజ ప్రారంభిస్తారని తెలిపారు.అత్యధికంగా పతకాలు సాధించిన రాష్ట్రానికి మేయర్ కప్ అందజేస్తామని వెల్లడించారు.

అగ్రిగోల్డ్ బాండ్లు వాపసు

విశాలాంధ్ర - కర్నూల్ లీగల్ : కర్నూలు, నంద్యాల జిల్లాల, గ్రామ ప్రజలకు తెలియచేయడం ఏమనగా లోపాలు కలిగినటువంటి 10,000/- లకు పై కలిగిన బాండ్లు, ఒకటి కన్నా ఎక్కువ కలిగిన అగ్రిగోల్డ్ బాండ్లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కర్నూలు కార్యాలయం నందు డిసెంబర్ 4 వ తేదీ నుండి ఉదయం 10.30 నుండి 05.00 వరకు వాపసు చేయడం జరుగునని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సి హెచ్. వెంకట నాగ శ్రీనివాస రావు శనివారము ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల పుర ప్రజలు పై తెలియజేసిన తేదీ నుండి తమ యొక్క రసీదులను తీసుకొని వచ్చి ఒరిజనల్ బాండ్లను వాపసు తీసుకోగలరని తెలియజేయడమైనది. ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోగలరు.

రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.సోమన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి జి.మునిస్వామి అధ్యక్షతన శనివారం రాయలసీమ యూనివర్సిటీలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సందర్భంగా జిల్లా అధ్యక్షులు డి.సోమన్న మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీలో ఇప్పటికి కూడా అనేక కోర్సులు లేవని, పీజీ సెంటర్ మాదిరిగా ఉందని ఆయన విమర్శించారు. విద్యార్థులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి, రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధి కోసం తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. యూనివర్సిటీలో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నియంతృత్వం వల్ల చాలామంది విద్యార్థులు డిబార్లు కావడం జరిగిందని తెలిపారు. విద్యార్థినీల కోసం హెల్త్ సెంటర్ ని ఏర్పాటు, టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ, 53 జీవోని రద్దు, హాస్టల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. మెస్సు బిల్లులతో సహా అధికంగా పే చేయడం ,కనీసం త్రాగటానికి నీళ్లు కూడా లేనటువంటి పరిస్థితుల్లో విద్యార్థులు ఉన్నారని ఆయన చెప్పారు. జీవోల పేరుతో యూనివర్సిటీలో విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రశ్నించే వారిని బయటకు బయటికి పంపుతామని బెదిరిస్తున్నారని చెప్పారు. ఇక్కడి నియంతృత్వ విధానానికి వ్యతిరేకంగా విద్యార్థుల రక్షణ కోసం ప్రతి ఒక్క విద్యార్థి ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన కోరారు. మెస్సు విద్యార్థులకు తిన్న వరకు మాత్రమే మెస్ బిల్లులు కట్టించుకునేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నగర కోశాధికారి అశోక్,చరన్ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ అధ్యక్షుడుగా రాజేష్

యూనివర్సిటీ కార్యదర్శిగా ధనలక్ష్మి

రాయలసీమ యూనివర్సిటీ ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

యూనివర్సిటీ అధ్యక్షులుగా ఎం.రాజేష్, ఉపాధ్యక్షులుగా పవన్, మల్లికార్జున, అలీఅక్బర్,యూనివర్సిటీ ప్రధాన కార్యదర్శిగా ధనలక్ష్మి ,సహాయ కార్యదర్శులుగా పి.భాస్కర్, వై.మౌలాలి, జీ.వాణిలను ఎన్నుకున్నారు.

ఎంఈఓ అవినీతి అక్రమలపై విచారణ జరిపించాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీరాములు గౌడ్

విశాలాంధ్ర - మంత్రాలయం : మంత్రాలయం, కోసిగి మండల విద్యా శాఖ అధికారి మొయినుద్దీన్ అవినీతి అక్రమాలపై జిల్లా విద్యాశాఖ అధికారులు విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల నందు ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీరాములు గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ భాషా, జిల్లా సహాయకార్యదర్శిలు : విజేంద్ర, థామస్ లు మాట్లాడుతూ ప్రభుత్వ విద్య రంగా అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి లక్షల రూపాయలు నిధులు ప్రభుత్వం కేటాయిస్తే ప్రభుత్వం కేటాయించినటువంటి నిధులలో ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా లక్షల రూపాయలు దండుకుంటున్నాడు, నాడు నేడు కింద కూడా కొన్ని పాఠశాలలో రంగులతో ముస్తాబు చేసి పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కలిసి వేలాది రూపాయలు దోచుకున్నటువంటి చరిత్ర ఆయనకు ఉందని ఆరోపించారు, కొంతమంది ఉపాధ్యాయుల నుంచి డబ్బులు తీసుకొని ఉపాధ్యాయులు విధులు నిర్వహించకుండా ఉంటే కూడా ఈయన మాత్రం ఏం చొరవ తీసుకోవడం లేదు. టీచర్స్ యొక్క టర్లు డబ్బులు కొంతమంది ఉపాధ్యాయులకు ఇస్తూ మరి కొంత మంది ఉపాధ్యాయులకు ఇవ్వడం లేదు. రెండు మండలాలు ఇన్చార్జిగా ఉండడంవల్ల ఏ మండలంలో కూడా ఈయన సక్రమంగా విధులు నిర్వహించడం లేదన్నారు, ప్రభుత్వ విద్యారంగాన్ని అభివృద్ధి పరిచాల్సినటువంటి విద్యాశాఖ అధికారి ముఖ్యంగా ప్రైవేట్ స్కూల్ ఇచ్చేటువంటి ముడుకులకు ఆశపడి ప్రవేట్ స్కూల్లో ఎన్నో అక్రమాలు జరుగుతున్నప్పుడు కూడా ఏమాత్రం పట్టించుకునే దాకలే ఆయన చరిత్రలో లేవన్నారు. అదేవిధంగా ఇంత అవినీతి అక్రమాలు చేసి కూడా భవనం నందు టాయిలెట్స్ కూడా నిర్మించుకో లేకున్నటువంటి దుస్థితి ఏర్పడిందన్నారు, కావున తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ఆయనపై విచారణ జరిపి,ఆయనను విధులనుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆయనను సస్పెండ్ చేసేంతవరకు కూడా దశల వారి ఉద్యమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. అనంతరం ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వీరేష్, అరవింద్,గోవిందు,సుభాన్,రాజేంద్ర, నవీన్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

కళ్లను మంచిగా కాపాడుకోండి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : మానవునికి అన్ని అవయవాల కన్నా నేత్రం ప్రధానమైనదని మాజీ గ్రంథాలయ చైర్మన్ కేజీ గంగాధర రెడ్డి పేర్కొన్నారు.శనివారం సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో పాత్రికేయుల కొరకు మాజీ గ్రంథాలయ చైర్మన్ కేజీ గంగాధర రెడ్డి, సుశీల నేత్రాలయం హాస్పిటల్ అధినేత సుధాకర్ రావు సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సమాచార శాఖ ఉపసంచాలకులు జయమ్మతో కలిసి మాజీ గ్రంథాలయ చైర్మన్ కేజీ గంగాధర రెడ్డి ప్రారంభించారు. గ్రంథాలయ చైర్మన్ కేజీ గంగాధర రెడ్డి మాట్లాడుతూ మానవునికి అన్ని అవయవాల కన్నా నేత్రం ప్రధానమైనదని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన పై ఉంది అని అన్నారు. అందులో ముఖ్యంగా పాత్రికేయ వృత్తిలో ఉన్నవారు. కంప్యూటర్ మరియు సెల్ ఫోన్ ద్వారా ఎక్కువ పని చేస్తుంటారు కాబట్టి త్వరలో దృష్టి లోపాలు ఏర్పడే అవకాశాలు ఉంటాయి అని , అందుకొరకే ఈరోజు పాత్రికేయుల కొరకు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాని ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు.సుశీల నేత్రాలయం హాస్పిటల్ డాక్టర్ నేహా మాట్లాడుతూ ప్రతి మనిషి 45 సంవత్సరాలు దాటిన అనంతరం కంటి పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఉంటుందన్నారు, 45 సంవత్సరాలు దాటిన వారిలో అశ్వదృష్టి, దూ రదృష్టి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని కావున కంటి పరీక్షలు చేయించుకుని కంటి అద్దాలు వాడడం వల్ల కంటిని కాపాడుకోవచ్చునన్నారు, కంటి పరీక్షలు చేయించుకోకుండా ఉంటే కన్ను దెబ్బ తినే అవకాశాలు ఉన్నాయని కావు కంటి పరీక్షలు చేయించుకుని కంటిని కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మీసాల రామస్వామి, ఆల మధుసూదన రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ హర్షిత,బుట్టా ఫౌండేషన్ మేనేజర్ చరిత, కోఆర్డినేటర్ దాదాబి, ఎలక్ట్రానిక్, ప్రింట్, ఫోటోగ్రఫీ, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీతోనే సుపరిపాలన

విశాలాంధ్ర - వెల్దుర్తి : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డితోనే సుపరిపాలన సాధ్య పడుతుం దని పత్తికొండ ఎమ్మెల్యే కె.శ్రీ దేవి అన్నారు. శనివారం మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామ సచివాలయం 1, 2 పరి ధిలో ని చెర్ల కొత్తూరు గ్రామాలలో పై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కె.శ్రీదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ వైకాపా నాయకులతో కలిసి గ్రామంలో వైకాపా జెండాను ఆవిష్కరించారు. అనంతరం చెర్ల కొత్తూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం నిధుల కింద రూ.17లక్షలతో నిర్మించిన నూతన సిసి రోడ్లను ఎమ్మెల్యే కె.శ్రీదేవి చేతుల మీదుగా గ్రామ వైకాపా నాయకుల ఆధ్వర్యంలో ప్రారం భించారు. ఈ కార్య క్రమంలో అధికారులు, జడ్పిటిసి సుంకన్న, వైస్ ఎంపిపి రంగయ్య, సర్పంచ్ ఎల్లా రాముడు, జయరాముడు రంగన్న పుల్లగుమ్మి నాగార్జున రెడ్డి వెల్దుర్తి మండలం వైకాపా నాయకులు, గోవర్ధనగిరి, చెర్ల కొత్తూరు గ్రామాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటుకు అర్హులైన వారు నమోదు చేసుకోండి

విశాలాంధ్ర - కృష్ణగిరి : అర్హులైన వారు ఓటు నమోదు చేసుకోవాలని తాసిల్దార్ పి.రాజేశ్వరి అన్నారు. శనివారం అమకతాడులో 191, 192 , పుట్లూరు లో193 ఓటు క్యాంప్ పోలింగ్ స్టేషనులను ఆమె పరిశీలించారు. రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ ఆదేశాల మేరకు ఓటు స్పెషల్ క్యాంప్ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ మండలంలో 18 సంవత్సరాల నిండిన యువతి యువకులు ఓటు నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు. పోలింగ్ బూత్ లో ఫామ్ 6,7,8 దరఖాస్తులు బిఎల్ఓల దగ్గర అందుబాటులో ఉంటాయి ఆధార్ కార్డు పాస్ ఫోటో తీసుకుని వెళ్తే ఓటును నమోదు చేస్తారని ఆమె తెలిపారు. శనివారం ఉదయం నుండి ఓటు నమోదుకు280, సవరణకు100, తొలగింపుకు 62 దరఖాస్తులు వచ్చాయన్నారు. నేడు కూడా ఓటు నమోదు, సవరణ, తొలగింపు స్పెషల్ క్యాంపు ఉంటుంది పోలింగ్ స్టేషన్ లో బూతులెవల్ల అధికారులు ఉంటారు ఓట్ల జాబితాను చూసుకొని ఏవైనా సవరణలు ఉంటే సరి చేసుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అమకతాడు వీఆర్వో గిడ్డయ్య, చిట్యాల వీఆర్వో అయ్యన్న, బూతు లెవల్ అధికారులు తదితరులు ఉన్నారు.

జన సంక్షేమానికి పెద్దపీట

విశాలాంధ్ర - పత్తికొండ : జన సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికే దక్కిందని ఎంపీపీ నారాయణ దాస్ అన్నారు. శనివారం పుచ్చకాయల మాడ గ్రామంలో ఆంధ్రప్రదేశ్ కు జగన్ మోహన్ రెడ్డి ముఖ్య మంత్రిగా ఎందుకు కావాలంటే కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి ఇంద్రాణి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైసీపీ నాలుగున్నర సంవత్సరాల పాలన కాలంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడం జరిగిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్ లో సీఎం జగన్ సంక్షేమ పథకాలను ముందుకు తీసుకెళుతున్నారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా నెరవేర్చడం జరిగిందన్నారు. 2024 ఎన్నికలలో జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ కారం నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, మాజీ సర్పంచ్ సోమశేఖర్, వైసీపీ గ్రామ నాయకులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

హై స్కూల్లో ఐఎఫ్‌పి టీవీ ధ్వంసం

విశాలాంధ్ర - హొళగుంద : హొళగుంద జిల్లా పరిషత్ హై స్కూల్లో శుక్రవారం రాత్రి ఎవరు గుర్తుతెలియని వ్యక్తులు కిటికీలను విరగగొట్టి పదో తరగతి ఏ సెక్షన్ భవనంలోని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ టీవీ ని ధ్వంసం చేశారు రోజు విద్యార్థులకు టీవీల ద్వారా విద్యా బోధన లను ఉపాధ్యాయులు బోధించేవారు అయితే దొంగలు పాఠశాల భవనంలో దూరి ఐఎఫ్‌పి టీవీని ధ్వంసం చేయడం వల్ల విద్యార్థుల విద్యా బోధనకు తీవ్ర ఇబ్బంది కలిగింది వాచ్మెన్ నియమించినప్పటికీ హై స్కూల్ ఫర్నిచర్ ధ్వంసం కావడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందారు హెడ్మాస్టర్ ఎండి నజీర్ అహ్మద్ హై స్కూల్లో జరిగిన సంఘటన గురించి పోలీసులకు సమాచారము అందించి శనివారం చైర్మన్ సిద్దయ్య తోటి ఉపాధ్యాయులతో కలిసి వెళ్లిఫిర్యాదించారు దాదాపు లక్ష యాభై వేల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని హెడ్మాస్టర్ తెలిపారు ఎస్సై శ్రీనివాసులు వాచ్మెన్ మల్లేష్ ను విచారించారు ఎవరు ఆకతాయిలు చేసిన పని అని విచారిస్తామని అన్నారు.

బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ

విశాలాంధ్ర - కర్నూల్ లీగల్ : కల్లూరు అర్బన్ 32 వార్డు గంగావతి నగర్ ముజఫర్ నగర్ నందు టిడిపి జాతీయ అధ్యక్షులు నార చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు "బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ" కార్యక్రమం నిర్వహించి కాలని లో సమస్యలు తెలుసుకుంటూ, టిడిపి జనసేన పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి చంద్రబాబు ప్రకటించిన సూపర్ 6 భవిష్యత్తు గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు అవగాహన, మహిళలతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించిన పాణ్యం మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇంచార్జి గౌరు చరిత రెడ్డి ఈ ప్రచార కార్యక్రమంలో గంగావతి నగర్ కాలనీకి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త మారెన్న సతీమణి ఈరమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న వలన ఆర్థిక సాయం అందించిన గౌరు చరిత రెడ్డి. ఈ కార్యక్రమంలో వార్డ్ ఇంచార్జి టైలర్ నాగరాజు, జనసేన నాయకులు సుధాకర్,నాగరాజు,సునీల్,అంజి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపోగు వెంకట స్వామి,మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ యన్ వి రామకృష్ణ, నియోజకవర్గ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు యస్ ఫిరోజ్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి గంగాధర్ గౌడ్,బిసి సెల్‌రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేశ్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

చట్టాలకు హిందీ పేర్లు

- మహువా బహిష్కరణపైనా చర్చ
- అఖిలపక్ష భేటీలో ప్రతిపక్షాల డిమాండ్
- అన్ని అంశాలపై నిర్మాణాత్మక చర్చలకు సిద్ధం: సర్కార్

న్యూదిల్లీ: పార్లమెంటు సమావేశాలకు ముందు నిర్వహించే అఖిలపక్ష భేటీలను కాలాన్ని వృధా చేసే సమావేశాలుగా ప్రభుత్వం మార్చిందని ప్రతిపక్షాలు విమర్శించాయి. అఖిలపక్ష సమావేశాలతో సమయం వృధా అవుతుందే తప్ప ప్రయోజనం ఉండటం లేదని దుయ్యబట్టాయి. చర్చలు జరపకుండా బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెడుతోందని ఆరోపించాయి. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఆధారాల చట్టం స్థానంలో మూడు బిల్లులను ఆమోదించవద్దని సూచించాయి. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సభ్యులు మహువా మొయిత్రాను లోక్‌సభ నుంచి తొలగించే విషయంలో నైతిక కమిటీ నివేదిక మీద పార్లమెంటులో చర్చించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. మణిపూర్ పరిస్థితి, అధిక ద్రవ్యోల్బణం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) దుర్వినియోగం, చట్టాలకు హిందీ పేర్లతో పాటు క్రిమినల్ చట్టాల స్థానె తెచ్చే మూడు బిల్లులపై ప్రధానంగా చర్చను కాంగ్రెస్ సహా విపక్షాలు కోరాయి. మహారాష్ట్రను కుదిపివేస్తున్న మరాఠా, ధంగర్ వర్గాలకు రిజర్వేషన్ అంశంపైనా చర్చ జరపాలన్నాయి. చిన్న పార్టీలకు సభలో మాట్లాడేందుకు ఎక్కువ సమయం కేటాయించాలి తదితర అంశాలపై చర్చకు డిమాండ్ చేశాయి. పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం అఖిలపక్ష సమావేశాన్ని కేంద్రప్రభుత్వం నిర్వహించింది. అన్ని అంశాలపై నిర్మాణాత్మక చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. చట్టసభలు సజావుగా సాగేందుకు సహకరించాలని విపక్షాలను కోరింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో 23 పార్టీలకు చెందిన 30 మంది నాయకులు హాజరయ్యారు. వీరిలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి, కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, గౌరవ్ గొగోయ్, ప్రమోద్ తివారీ, టీఎంసీ నేతలు సుదీప్ బందోపాధ్యాయ, డెరెక్ ఓ బ్రెయిన్, ఎన్‌సీపీ నేత ఫౌజియా ఖాన్ తదితరులు ఉన్నారు. టీఎంసీ నేతలు సుదీప్ బందోపాధ్యాయ, డెరెక్ ఓ బ్రెయిన్ మాట్లాడుతూ మహువా మొయిత్రాను తొలగించాలని లోక్‌సభ ఎథిక్స్ కమిటీ నివేదికపై చర్చను డిమాండ్ చేశారు. 'ఇప్పటికే కొందరు ఎంపీలు సస్పెన్షన్‌లో ఉన్నారు. టీఎంసీ సభ్యుల్లో ఒకరిని సస్పెండ్ చేస్తారని మీడియా నివేదికల ద్వారా తెలిసింది' అని అన్నారు. ఈ అంశంపై లోక్‌సభలో చర్చ జరగాలని, అనంతరం నిర్ణయం కూడా తీసుకోవాలని కోరారు. బెంగాల్‌కు పెండింగ్ ఉన్న ఎంజీఎన్ఆర్ఈజీఏ చెల్లింపులు, నిరుద్యోగం, అధిక ధరలపై చర్చకు డిమాండ్ చేశారు. శివసేన నేత రాహుల్ షీవాలే మాట్లాడుతూ మరాఠా, ధంగర్ వర్గాలకు రిజర్వేషన్ అంశాన్ని చర్చించాలన్నారు. భారత శిక్షా స్మృతి (ఐపీసీ), భారత ఆధారాల చట్టం, నేరపూరిత శిక్షాస్మృతి (సీఆర్‌పీసీ) చట్టాల స్థానె భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ శిక్ష (బీఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) క్రిమినల్ చట్టాలకు హిందీ పేర్లు పెట్టడాన్ని రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్ఎస్‌పీ) నేత ఎన్‌కే ప్రేమచంద్రన్, ఏఐఏడీఎంకే నేత ఎం.తంబిదురై వ్యతిరేకించారు. హిందీ పేర్లు పెడితే దక్షిణాది రాష్ట్రాల ప్రజలకు ఉచ్చరణ సమస్యవుతుందన్నారు. ఈ అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తామని చెప్పారు. తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు, సమస్యలను వివరించేందుకు చిన్న పార్టీలకు అధిక సమయాన్ని కేటాయించాలని జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) నేత మహువా మాఝీ డిమాండ్ చేశారు. కేవలం మూడు నిమిషాల్లో చెప్పాలనుకున్నది సరిగ్గా చెప్పలేకపోతున్నామని అన్నారు. ఇదిలావుంటే, ఐదు రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆదివారం రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. వీటి ప్రభావం పార్లమెంటు సమావేశాలపై ఉంటుందన్న అంచనా ఉంది. ఈనెల 4వ తేదీ నుంచి 22 వరకు పార్లమెంటు సమావేశాలు 15 సిట్టింగుల్లో జరగనున్నాయి. పార్లమెంటు వద్ద 37 బిల్లులు పెండింగ్‌లో ఉండగా వీటిలో 12 పరిశీలన, ఆమోదం దశలో ఉన్నాయి. మరో ఏడు ప్రవేశం, పరిశీలన, ఆమోదం దశలో ఉన్నాయి.

పరువు నష్టం కేసులో లాలుకు ఊరట

పాట్నా: పరువు నష్టం కేసులో ఆర్జేడీ అధినేత లాలు ప్రసాద్ యాదవ్‌కు ఊరట లభించింది. సరైన ఆధారాలు లేని కారణంగా లాలును నిర్దోషిగా ప్రత్యేక కోర్టు ప్రకటించింది. ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసులను విచారించే ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సారికా బహాలియా ఈ మేరకు శనివారం ఆదేశాలిచ్చారు. 2017పై లాలుపై ఉదయ్ కాంత్ మిశ్రా పరువు నష్టం దావా వేశారు. శ్రీజన్ కుంభకోణంలో ప్రమేయం ఉన్నట్లు తనపై ఆరోపణలు చేయడం ద్వారా సమాజంలో పరువు తీశారని ఆరోపించారు. లాలుపై కేసును ప్రత్యేక కోర్టు విచారించింది. కోర్టు ఎదుట వాంగ్మూలం ఇచ్చేందుకు రావాలని అనేకసార్లు మిశ్రాకు ఆదేశాలిచ్చింది. కానీ ఆయన రాలేదు. ఈ కేసులో రాజీపత్రం కూడా దాఖలైంది. సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా యాదవ్‌కు కోర్టు ఊరట కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

సహజ అభ్యుదయ కవి ఆవంత్స

విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో వక్తలు

విశాలాంధ్ర – విశాఖ: సహజ అభ్యుదయ కవిగా ఆవంత్స సోమసుందర్ నిలిచారని, తెలంగాణ ఉద్యమాన్ని కోస్తా ప్రాంతం నుండి సమర్థించి కవిత్వం వెలువరించిన నిష్పక్షపాత వ్యక్తిత్వం ఆయన సొంతమని వక్తలు అభిప్రాయపడ్డారు. అభ్యుదయ కవితా శిఖరం ఆవంత్స సోమసుందర్ శత జయంతి వత్సర సభ అరసం అధ్వర్యంలో శనివారం సాయంత్రం విశాలాంధ్ర విశాఖ 22వ పుస్తక మహోత్సవ ప్రాంగణంలో జరిగింది. ముందుగా అడపా రామకృష్ణ రచించిన దేశమేగతి బాగుపడునోయ్ కథల సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షత వహించగా ఆచార్య డీవీ సూర్యారావు, కిలారి గౌరినాయుడు, కేవీఎస్ మూర్తి, వెలమల సిమ్మన్న తదితరులు సోమసుందర్ గురించి మాట్లాడుతూ 'వజ్రాయుధం' నుండి 'ఆమ్రపర్ణి' వరకూ సుమారు ఆరున్నర దశాబ్దాల పాటు సోమసుందర్ చేసిన కవితాయానంలో సమాజ సంకుల సమరమే అన్ని కోణాల్లోనూ ప్రతిబింబిస్తుందని అభిప్రాయపడ్డారు. జాతి చైతన్యాన్ని కవితా చైతన్యంగా సమర్థవంతంగా చేసిన అభ్యుదయ కవిగా సోమసుందర్ నిలిచారని అభివర్ణించారు. కార్యక్రమంలో సీఎస్ క్షేత్రపాల్‌రెడ్డి, పి.శ్యాంసుందర్, ఎస్.హనుమంతరావు, పీఏ రాజు, మేడా మస్తాన్‌రెడ్డి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై అత్యాచారం కేసు పెట్టొచ్చా?

సుప్రీంకోర్టు పరిశీలన

న్యూదిల్లీ: అత్యాచార కేసులో మహిళపై అభియోగాలు నమోదు చేయొచ్చా అనే అంశాన్ని సుప్రీంకోర్టు పరిశీలించనుంది. ఓ అత్యాచార కేసులో మహిళ దాఖలు చేసిన ముందస్తు బెయిల్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ విషయాన్ని వెల్లడించింది. తన కోడలు పెట్టిన అత్యాచార కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న 61 ఏళ్ల మహిళ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను స్వీకరించిన సుప్రీంకోర్టు... దీనిపై తమ స్పందన తెలియజేయాలంటూ పంజాబ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. మహిళపై అత్యాచార కేసు నమోదు చేయొచ్చా లేదా అనే అంశాన్ని తాము పరిశీలిస్తామని ధర్మాసనం వెల్లడించింది. అంతవరకు పిటిషన్‌దారుకు అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తున్నట్లు తెలిపింది. దర్యాప్తునకు సహకరించాలని ఆమెను ఆదేశించింది. వివరాల్లోకి వెళితే...పంజాబ్‌కు చెందిన 61 ఏళ్ల మహిళ.. గతేడాది సెప్టెంబరులో తన పెద్ద కుమారుడికి ఓ యువతితో వివాహం జరిపించింది. అప్పుడు ఆమె కుమారుడు అమెరికాలో ఉండగా వర్చువల్‌గానే ఈ పెళ్లి నిర్వహించారు. ఆ తర్వాత నుంచి అత్తాకోడళ్లు ఒకే ఇంట్లో ఉంటున్నారు. వివాహం తర్వాత ఆమె పెద్ద కుమారుడు స్వదేశానికి రాలేదు. ఆ తర్వాత కొన్నాళ్లకు మహిళ చిన్న కుమారుడు పోర్చుగల్ నుంచి వచ్చారు. కొన్ని రోజులు కుటుంబంతో ఉండి ఈ ఏడాది జనవరిలో తిరిగి వెళ్లిపోయాడు. అతడు వెళ్లిపోయిన కొన్నాళ్లు ఆ కోడలు... తన అత్త, ఆమె చిన్న కుమారుడిపై అత్యాచార కేసు పెట్టింది. నగ్న ఫొటోలు చూపించి అతడు తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని, ఆ విషయం బయటకు చెప్పొద్దంటూ తన అత్త బెదిరించిందని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. దీంతో పోలీసులు ఆ మహిళ, ఆమె చిన్న కుమారుడిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం ఆ మహిళ కింది కోర్టులను ఆశ్రయించగా... ఆమె పిటిషన్‌ను న్యాయస్థానాలు కొట్టేశాయి. దీంతో ఆమె సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

అణగారిన వర్గాలకు నిర్ణయాత్మక అధికారం కావాలి

జనసేన అధినేత పవన్ కల్యాణ్

విశాలాంధ్ర-మంగళగిరి: సమాజంలో అణగారిన, వెనకబడిన వర్గాలకు నిర్ణయాత్మక అధికారం కావాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. వారి వారి కులాలకు సంబంధించి అభివృద్ధి వైపు నడిపించే నిజమైన అధికారం వారికి చెందాలన్నది జనసేన ఆకాంక్ష అని, ఇప్పటి వరకు అధికారం చూడని కులాలకు నిజమైన అధికారం దక్కాలని అన్నారు. శనివారం గుంటూరు జిల్లా మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పవన్ కల్యాణ్ సమక్షంలో అనేక మంది కీలక నేతలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను ప్రతి సభలోనూ కులాల గురించి మాట్లాడతానని వైసీపీ నాయకులు అంటుంటారని, 80 శాతం నామినేటెడ్ పోస్టులను, ఇతర పదవులను ఒకే కులానికి కట్టబెట్టిన వైసీపీకి అసలు కులాల గురించి మాట్లాడే నైతిక అర్హత కూడా లేదని గుర్తించుకోవాలని స్పష్టం చేశారు. తాను కులాల గురించి ఎప్పుడు మాట్లాడినా విద్వేషాలు నింపేలా మాట్లాడనని, ఆయా కులాల సాధికారత, అభివృద్ధి ఎలా జరగాలి అన్నదానిపైనే నిజాలు మాట్లాడతానన్నారు. మరోసారి వైసీపీ అధికారంలోకి రాకుండా ఉండాలనే స్పష్టమైన ఆలోచనతో, మరో ఛాన్స్ తీసుకోకూడదనే ఉద్దేశంతోనే జనసేన, టీడీపీ కలిసి ఎన్నికలకు వెళ్లబోతున్నాయని చెప్పారు. కచ్చితంగా గెలవాలన్నదే లక్ష్యమని, త్రిముఖ పోటీ జరిగితే రెండు మూడు శాతంతో జగన్ ప్రభుత్వం మళ్లీ ఏర్పడితే వనరులు, వ్యవస్థలనేవి రాష్ట్రంలో ఏమీ ఉండవని అన్నారు. 'ప్రజల కోసం నిలబడడమనే నా పంథా మార్చుకోను. నా కోసం నిలబడే వారికి వెన్నుదన్నుగా ఉంటాను' అని పవన్ అన్నారు.

జనసేనలో చేరికలు

రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన అనేక మంది ప్రముఖులు జనసేనలో చేరారు. రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షులు చిలకలపూడి పాపారావు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి వ్యాపారవేత్త చిక్కాల దొరబాబు, జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, వైసీపీ ట్రేడ్ యూనియన్ నాయకులు దుగ్గన నాగరాజు, డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యకులు కలగ పాల్ పురుషోత్తం, ఎదువాక శ్రీ వెంకటగిరి, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన పొగిరి సురేష్ బాబు, ఉమ్మడి కడప జిల్లాకు చెందిన వై.శ్రీనివాసరాజు భారీఎత్తున తమ అనుచరులతో కలసి జనసేనలో చేరారు. పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, ప్రోటోకాల్ కమిటీ చైర్మన్ మలినిడి తిరుమలరావు, మత్స్యకార వికాస విభాగం చైర్మన్ బొమ్మిడి నాయకర్, ప్రధాన కార్యదర్శులు టి.శివశంకర్, బొలిసెట్టి సత్య, నాయకులు వేగుళ్ల లీలాకృష్ణ, పంచకర్ల సందీప్, అమ్మిసెట్టి వాసు, పిసిని చంద్రమోహన్, కోటంరాజు శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అది యువగళ మేళా?: ఎంపి విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: అది యువగళమా? లేక స్కూలు పిల్లల్లో బానిస భావాలు పెంచే కార్యక్రమమా లోకేశ్ అంటూ రాజ్యసభ సభ్యుడు, వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. వైసీపీ ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన అమ్మ ఒడి పథకం దండగ అని రాళ్లు విసిరిన వ్యక్తి లోకేశ్ అని విజయసాయి రెడ్డి మండిపడ్డారు. పిల్లల చదువుల గురించి కొంచమైనా బాధ్యత ఉందా అని ప్రశ్నించారు. లోకేశ్ పాదయాత్రలో బడిపిల్లలతో పాదాభివందనం చేయించుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు. వాళ్లు తొడుక్కున్న యూనిఫాం నువ్వు ఇచ్చింది కాదని లోకేశ్‌ని ఉద్దేశిస్తూ అన్నారు. పసిపిల్లలతో పాదాలకు నమస్కారాలు పెట్టించుకోవడం అమానవీయం కాదా అని లోకేశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు అంతర్జాతీయంగా రాణించేందుకు అవసరమైన తర్ఫీదు స్కూళ్ల స్థాయి నుంచే అందించాలని విద్యాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారని గుర్తుచేశారు.

శాఖాహారులు భారత్‌లోనే అధికం

వరల్డ్ అట్లాస్ నివేదిక వెల్లడి

వాషింగ్టన్: అత్యధిక శాఖాహారులు గల దేశాల జాబితాను వరల్డ్ అట్లాస్ వెల్లడించింది. ఈ నివేదికలో భారతదేశం అగ్రస్థానంలో నిలిచింది. మొత్తం దేశ జనాభాలో 38 శాతం మంది శాకాహారులు ఉన్నారని తేలింది. 6వ శతాబ్దంలో బౌద్ధమతం, జైనమతం పరిచయం అయినప్పటి నుంచే ఈ శాకాహారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్టు గుర్తించవచ్చు. భారత్‌లోని శాకాహారుల్లో కొంతమంది లాక్టో-శాఖాహారానికి కట్టుబడి ఉంటారు. వీళ్లు తమ ఆహారంలో పాల ఉత్పత్తులు చేర్చుకుంటారు. గుడ్లు మాత్రం తినరు. ఈ విభిన్నమైన ఆహార విధానాలు భారతదేశపు సాంస్కృతిక, చారిత్రక ప్రభావాలను ప్రతిబింబిస్తాయి. మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... ప్రపంచ వ్యాప్తంగా అతి తక్కువ మాంసం వినియోగ రేటులో ఉన్న దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచింది. ప్రజలు శాకాహారం వైపు మొగ్గు చూపడానికి ఆరోగ్యం, పర్యావరణ ఆందోళనలు లేదా ఇతర కారణాలు ఉండొచ్చని నివేదిక సూచిస్తోంది. మతం, నైతిక ప్రేరణలు, ఆర్థిక పరిగణనలు, మాంసం పట్ల అసహ్యం, సాంస్కృతిక ప్రభావాలు వంటి అంశాలు ఈ ధోరణికి దోహదపడతాయని నివేదిక పేర్కొంది. ఇక లింగాయత్‌లు, బ్రాహ్మణులు, జైనులు, వైష్ణవులు కేవలం శాకాహారమే తీసుకుంటారని అందరికీ తెలుసు. ఇక భారత్ తర్వాత ఇజ్రాయిల్ రెండో స్థానంలో ఉన్నట్టు ఆ నివేదిక పేర్కొంది. ఇజ్రాయిల్‌లో ఉన్న మొత్తం జనాభాలో 18 శాతం మంది శాకాహారులు ఉన్నట్టు వరల్డ్ అట్లాస్ వెల్లడించింది. ఇజ్రాయిల్‌లో శాకాహార భావనను ప్రవేశపెట్టడంలో జుడాయిజం కీలక పాత్ర పోషించింది. దీని తర్వాత తైవాన్, ఇటలీ వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నాయి. తైవాన్‌లో 12 శాతం, ఇటలీలో 10 శాతం మంది శాకాహారులున్నట్టు ఆ నివేదిక స్పష్టం చేసింది. ఇక ఆస్ట్రియా, జర్మనీ, బ్రిటన్, బ్రెజిల్, ఐర్లాండ్, ఆస్ట్రేలియా దేశాలు వరుస స్థానాల్లో నిలిచాయి.

ఏఐటీయూసీలోకి సీఐటీయూ నేత

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.బాలకాశి సంఘంలోని విధానాలు నచ్చక శనివారం ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేష్, అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య సమక్షంలో ఏఐటీయూసీలో చేరారు. బాల కాశీ మెడలో ఏఐటీయూసీ కండువా వేసి ఓబులేసు యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలకాశి మాట్లాడుతూ ఏఐటీయూసీ నియమనిబంధనలకు లోబడి ఈ సంస్థ ద్వారా కార్మిక వర్గానికి సేవలు అందిస్తానని అన్నారు. చరిత్ర కలిగిన ఏఐటీయూసీలో చేరడం ఆనందంగా ఉందని, ఆ సంస్థ అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో అమలు చేస్తానని హామీ ఇచ్చారు. బాలకాశిని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకత్వం అభినందించింది.

నకిలీ కరెన్సీ గుట్టు రట్టు

న్యూదిల్లీ: జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) శనివారం నాలుగు రాష్ట్రాల్లో దాడులు నిర్వహించిన నకిలీ కరెన్సీ రాకెట్‌ను చేధించింది. ప్రింటింగ్ మిషన్లు, ప్రింటింగ్ పేపర్లు స్వాధీనం చేసుకుంది. రూ.6,600 నకిలీ కరెన్సీ నోట్లను సీజ్‌చేసింది. నకిలీ కరెన్సీ అంతా రూ.500, రూ.200, రూ.100 నోట్ల రూపంలో ఉంది. భారత శిక్షాస్మృతిలోని(ఐపీసీ) సంబంధిత సెక్షన్ల కింద నవంబర్ 24న నమోదైన కేసుపై ఎన్ఐఏ ఈ చర్య తీసుకుంది. సరిహద్దుల గుండా నకిలీ కరెన్సీ నోట్లను రవాణా చేయడానికి, వివిధ రాష్ట్రాల్లో నకిలీ కరెన్సీ చలామణిని ప్రోత్సహించడానికి నిందితులు కుట్ర పన్నినట్టు ఎన్ఐఏ అనుమానించింది. దీంతో శనివారం దాడులు చేసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు కీలక నిందితుల ఆవరణలో తనిఖీలను చేపట్టింది. మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లాలో రాహుల్ తానాజీ పాటిల్, యవత్మాల్ జిల్లాలో శివపాటిల్, ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్ జిల్లాలో వివేక్ ఠాకూర్, కర్నాటకలోని బళ్లారి జిల్లాలో మహేందర్, బీహార్‌లోని రోహ్తాస్ జిల్లాలో శశి భూషణ్ నివాసాలను సోదా చేసిన అధికారులు నకిలీ కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. శివపాటిల్ మరికొందరితో కలిసి మన దేశంలో చలామణికి పొరుగు దేశాల నుంచి నకిలీ కరెన్సీ, ప్రింటింగ్ మిషన్లను సేకరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. మహేందర్ ఇంట్లో ప్రింటర్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ నోట్ల సరఫరా చేస్తానని హామీ ఇచ్చిన రాహుల్ తానాజీ పాటిల్, మోసపూరితంగా పొందిన సిమ్ కార్డులను ఉపయోగించి చెల్లింపులు జరుపుతున్నట్లు విచారణలో తేలింది.

మీ ఉపగ్రహాలను ధ్వంసం చేస్తాం

అమెరికాకు కిమ్ హెచ్చరిక

ప్యాంగ్యాంగ్: తమ జోలికి వస్తే ఊరుకునేది లేదని ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ అగ్రదేశం అమెరికాకు హెచ్చరికలు పంపారు. ఇటీవల ఉత్తర కొరియా నిఘా ఉపగ్రహాన్ని ప్రయోగించిన నేపథ్యంలో ఈ ప్రకటన వచ్చింది. ఈ మేరకు కొరియా రక్షణ శాఖ స్పందించింది. 'మా అంతరిక్ష ఆస్తులపై వాషింగ్టన్ దాడులకు ప్రయత్నిస్తే.. మేం ఆ దేశ నిఘా శాటిలైట్లను ధ్వంసం చేస్తాం. అలాంటి చర్యలను యుద్ధ ప్రకటనగా భావిస్తాం' అని అమెరికాకు ఉ.కొరియా హెచ్చరికలు చేసింది. నిఘా ఉపగ్రహాన్ని భూకక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు కిమ్ ప్రభుత్వం గతంలో రెండుసార్లు విఫలయత్నం చేసింది. అయితే ఈ నెల ప్రారంభంలో రష్యా సహకారంతో శాటిలైట్ ప్రయోగాన్ని విజయవంతం చేసింది. గతవారం ఈ ప్రయోగం జరగ్గా... కిమ్ లాంచింగ్‌ను వీక్షించారు. ఈ ప్రయోగంతో దక్షిణ కొరియా, జపాన్, అమెరికా దేశాలు తమ సైన్యాన్ని అప్రమత్తం చేశాయి. అలాగే రోదసీ ప్రయోగాల ద్వారా ఎదురయ్యే ముప్పును వివిధ మార్గాల ద్వారా ఎదుర్కొంటామని ఉ.కొరియా ప్రయోగాన్ని ఉద్దేశించి అమెరికా స్పందించింది. ఈ క్రమంలోనే కిమ్ హెచ్చరికలు చేశారు.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి: మాయావతి

లక్నో: దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి డిమాండ్ చేశారు. పార్లమెంటు అసెంబ్లీ సమావేశాలు సోమవారం ప్రారంభం కానుండగా శనివారం అఖిలపక్ష సమావేశాన్ని కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా కుల గణన కోసం దేశంలోని అన్ని దిక్కుల నుంచి డిమాండ్ వస్తున్నట్లు మాయావతి తెలిపారు. కుల గణన డిమాండ్‌తో బీజేపీ నిద్రలేని రాత్రులు గడుపుతోందని విమర్శించారు. జాతీయ స్థాయిలో సరైన పద్ధతిలో కుల గణన చేపట్టాలని, ప్రజలకు హక్కుల్ని అందేలా చూడాలని మాయావతి డిమాండ్ చేశారు.

భారత్‌లో 66 శాతం మలేరియా కేసులు: డబ్ల్యూహెచ్‌ఓ

వాషింగ్టన్: గతేడాది భారత్‌లో 66 శాతం మలేరియా కేసులు నమోదయ్యాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రచురించిన ప్రపంచ మలేరియా నివేదిక 2023లో పేర్కొంది. వీటిలో దాదాపు 46 శాతం ప్లాస్మోడియం వైవాక్స్ వల్ల సంభవించాయని తెలిపింది. దోమ తెరలు, మందులు వినియోగించడం ద్వారా చిన్నపిల్లలు, గర్భిణీలలో మలేరియాను నివారించడంలో సహాయపడతాయని తెలిపింది. ఆగ్నేయాసియా ప్రాంతంలో 77 శాతం మరణాలు తగ్గాయని తెలిపింది. కాగా ఆగ్నేయాసియాలోని మొత్తం మలేరియా మరణాలలో 94 శాతం మరణాలు భారతదేశం, ఇండోనేసియాలో ఉన్నాయని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 2019లో 233 మిలియన్ల మలేరియా కేసులు నమోదు కాగా 2022లో అవి 249 మిలియన్ కేసులకు చేరుకున్నాయి. 2019 కంటే 2022లో 16 మిలియన్ కేసులు పెరిగాయని నివేదిక పేర్కొంది. కోవిడ్-19, మాదకద్రవ్యాలు, పురుగుమందుల నిరోధకత, మానవతా సంక్షోభాలు, వనరుల పరిమితులు, వాతావరణ మార్పుల ప్రభావాలు వంటివి మలేరియాపై పోరాటానికి ఆటంకం కలిగిస్తున్నాయని పేర్కొంది. 2016 నుండి నేటి వరకు శ్రీలంక మలేరియా రహిత దేశంగా కొనసాగుతుందని పేర్కొంది.

లండన్‌లో భారత విద్యార్థి మృతి

లండన్: లండన్‌లో భారత విద్యార్థి మిత్‌కుమార్ పటేల్ (23) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మిత్ కుమార్ ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్లాడు. రెండు నెలల అనంతరం నవంబర్ 17వ తేదీన మిత్‌కుమార్ అదృశ్యమయ్యాడు. బంధువుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదైంది. నవంబర్ 21వ తేదీన తూర్పు లండన్‌లోని కానరీ వార్ఫ్ ప్రాంతానికి సమీపంలో థేమ్స్ నదిలో పోలీసులు అతని మృతదేహాన్ని గుర్తించారు. మిత్‌కుమార్ మృతికి సంబంధించి ఎలాంటి అనుమానాలు లేవని మెట్రోపాలిటన్ పోలీసులు తెలిపారు. మిత్‌కుమార్ వ్యవసాయ కుటుంబానికి చెందినవాడు. అతని తల్లిదండ్రులకు ఆర్థిక సాయం చేసేందుకు గో ఫండ్ మీ అనే ఆన్‌లైన్ ఫండ్ రైజర్ ద్వారా నిధుల సేకరణ ప్రారంభించినట్లు తన బంధువు పార్థ్‌పటేల్ తెలిపాడు. ఒక్కవారం వ్యవధిలోనే జీబీపీ (గ్రేట్ బ్రిటన్ పౌండ్స్) 4,500కి (భారత కరెన్సీలో 4 లక్షల 76 వేలు) పైగా వచ్చాయని పటేల్ అన్నారు. 'ఉన్నత చదువుల కోసం మిత్‌కుమార్ సెప్టెంబర్‌లో లండన్‌కి వచ్చాడు. షెఫీల్డ్ హాలం విశ్వవిద్యాలయంలో డిగ్రీ కోర్సు చదవడానికి ఇక్కడికి వచ్చాడు. ఇక్కడ అమెజాన్‌లో అతనికి పార్ట్‌టైం జాబ్ కూడా వచ్చింది. నవంబర్ 17వ తేదీ డైలీ వాక్‌కి వెళ్లిన మిత్... మళ్లీ తిరిగి ఇంటికి వెళ్లలేదు. మాకు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఇంతలోనే చనిపోవడం బాధకు గురిచేస్తుంది. సేకరించిన డబ్బుల్ని అతని కుటుంబానికి అందజేస్తాం. మృతదేహాన్ని భారత్‌కి పంపిస్తాం' అని పార్థ్‌పటేల్ అన్నారు.

PRINTED & PUBLISHED BY EDUPUGANTI NAGESHWARA RAO, On Behalf of VISALAANDHRA VIGANANA SAMITI, PRINTED AT AMODA PUBLICATIONS PVT. LTD, AMODA PRESS, Andhra Jyothi Buildings, S.No: 1/1 & 1/2, Near Indus High School,Gooty Road, Pandipadu Grama Panchayati, KURNOOL, ANDHRA PRADESH, PUBLISHED AT VISALAANDHRA VIGNANA SAMITI, C.R.BHAVAN, SAPTAGIRINAGAR, KURNOOL, ANDHRA PRADESH. EDITOR : R.V. RAMARAO. RNI NO:APTEL/2013/54446. Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : 08518-255522,255555, Fax No. 277721, E-Mail : visknl@ yahoo.com